క్లుప్తంగా

పేద కుటుంబానికి సాయం

కోట: కోటకు చెందిన శ్రీషిరిడీసాయి అక్షయ సేవాసమితి సహకారంతో అన్నమేడుకు చెందిన అనిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబం సేవాసమితి సాయం కోరింది. దీంతో స్పందించిన సభ్యులు సోమవారం తమ కార్యాలయంలో సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, వెంకటరమణారెడ్డి, అనంతాచార్యులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు



ఆటో బోల్తా పడడంతో రోడ్డు పక్కన ఉన్న డ్రైవర్ కాలేషా

చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారిపై పత్రగుంట సమీపంలో ఆటో బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఓజిలి గ్రామానికి చెందిన కాలేషా అనే ఆటో డ్రైవర్ ప్యాసింజర్లను గూడూరుకు తీసుకుని వచ్చి తిరిగి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై బూదనం టోల్ ప్లాజా దాటిన తరువాత పత్రగుంట సమీపంలో అదుపు తప్పిన ఆటో రోడ్డు పక్కన గుంతలోకి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు స్వర్ణ టోల్ ప్లాజా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సైదాపురం: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. వివరాలు.. సైదాపురం మండలంలోని రామసాగరం గ్రామానికి చెందిన జడపల్లి శ్రీనయ్య, వెంకటేశ్వర్లుకు కల్లుగీత విషయంలో వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో ఆదివారం ఇరువురూ ఘర్షణ పడగా శ్రీనయ్యకు గాయాలయ్యాయి. దీంతో భయపడిన వెంకటేశ్వర్లు గ్రామ సమీపంలోని ఓ తోటకు వెళ్లి పురుగుల మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబీకులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం మృతి చెందినట్లు సైదాపురం పోలీసులకు సమాచారం అందింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

దర్గా కమిటీ సభ్యుల సమావేశం



సమావేశమైన ఉరుసు కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నది సమీపంలో ఉన్న దర్గాలో ఉరుసు నిర్వహణపై చర్చించడానికి ఆ దర్గా కమిటీ సభ్యులు సోమవారం సమావేశమయ్యారు. గంధోత్సవాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉరుసు కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, సభ్యులు రాజేశ్వరరావు, రమేష్ బాబు, పులి రామచంద్రయ్య, ఉదయ్‌కుమార్, బావాజన్, రహీంఖాన్, అబ్దుల్లా, సయ్యద్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం..అపార నష్టం

శ్రీకాళహస్తి రూరల్: ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట కోత దశలో కురిసిన వర్షానికి రైతులకు అపార నష్టం మిగిలింది. శ్రీకాళహస్తి మండల పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సుమారు 300 ఎకరాలు వరి పంట నేలకొరిగింది. మండలంలోని తొండమాన్‌పురం, అమ్మపాళెం, పుల్లారెడ్డి కండ్రిగ గ్రామాల్లో వరి పంట దెబ్బతినింది. అధికారులు స్పందించి పంట నష్ట పరిహారం పంపిణీకి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపారు. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన కోచ్ వినోద్ ఆధ్వర్యంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. 25 కిలోల విభాగంలో క్రీడాకారిణి ప్రఖాత, 35 కిలోల విభాగంలో క్లారీస్, 28 కిలోల విభాగంలో నమస్వి బంగారు పతకాలు సాధించారు. అలాగే 27 కిలోల విభాగంలో కుశాంత్‌కుమార్, 21 కిలోల విభాగంలో తన్వి వెండి పతకాలను సాధించారు. వీరికి నిర్వాహకులు పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. వీరిని పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, పసుపు, కుంకుమ, విభూది తదితర సుగంధద్రవ్యాలు, నారికేళ జలాలతో అభిషేకాలు చేశారు.

నింధితులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా ఘటన తరువాత ప్రభుత్వ వైద్యశాలలో ఉద్యోగం చేయాలంటేనే భయమేస్తుంది. మృగాళ్లను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. డ్యూటీలో ఉండే మహిళా డాక్టర్లు, నర్సుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. మహిళా డాక్టర్లు, మహిళా నర్సులు విధుల్లో ఉండే ప్రతి చోటా ప్రత్యేకంగా సెక్యూరిటీ పెంచాలి.

– డాక్టర్ కీర్తిప్రియ, వాకాడు, పీహెచ్‌సీ



ప్రత్యేక చట్టం రావాలి

రోజుల తరబడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి రోగులకు సేవలందించే వైద్యులకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి. అప్పుడే స్వేచ్ఛగా వైద్య సేవలు అందించగలరు. కొన ఊపిరితో తమ వద్దకు వచ్చే రోగి ప్రాణాలు కాపాడదానికి వైద్యులు శాయశక్తులా ప్రయత్నిస్తారు. అలాంటి వైద్యులు, నర్సులపై దాడులు చేయడం దురదృష్టకరం. వైద్యులపై దాడులు చేసిన వారికి విధించే శిక్షలు చూసి ఇంకోచోట దాడులకు పాల్పడకుండా భయపడే విధంగా ఉండాలి.

– డాక్టర్ కల్పన, వాకాడు, పీహెచ్‌సీ



వ్యవసాయ పొలాలకు పుష్కలంగా సాగునీరు అందించేందుకు ప్రధాన ఆధారమైన చెరువులు పలుచోట్ల ఆక్రమణలకు గురవుతున్నాయి. పంటలకు సాగునీరు సక్రమంగా అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. చెరువు భూముల ఆక్రమణలపై పలువురు రైతులు ఏళ్ల తరబడి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. అయితే క్షేత్రస్థాయి అధికారులు కొందరు పెత్తందారుల ప్రలోభాలకు తలొగ్గి చోద్యం చూస్తున్నారు. – పెళ్లకూరు

చెరలో చెరువులు



చెంబేడు చెరువు

- చోద్యం చూస్తున్న అధికారులు
- సాగునీరు అందక అన్నదాతల అవస్థలు

మండలంలోని 24 పంచాయతీలలో 3822 హెక్టార్లు విస్తీర్ణంతో మైనర్, మీడియం ఇరిగేషన్ పరిధిలో 77 చెరువులు ఉన్నాయి. వివిధ గ్రామాల్లోని రైతులు చెరువులపై ఆధారపడి ప్రతి ఏటా 4523హెక్టార్లు వరి, 1578 హెక్టార్లు వేరుశనగ, మరో 1585ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. ప్రస్తుతం చెరువుల విస్తీర్ణంలోని చెరువు భూములను స్థానిక పెత్తందారులు, భూస్వాములు, ఎగువ ప్రాంతాలకు చెందిన రైతులు కబ్జా చేసి, వ్యవసాయ భూములుగా మార్చుకుని అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. దీంతో ప్రతిఏటా సాగునీరు సమృద్ధిగా చెరువుల్లో నిల్వ చేసుకోలేక ఇక్కడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిల్లకూరు పెద్ద చెరువు సర్వే నంబరు 186లో 278.80 హెక్టార్లు విస్తీర్ణం కలిగి ఉంది. ఈ చెరువు కింద సుమారు వెయ్యి ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగి, వరి సాగు చేస్తున్నారు. అయితే ఎగువ ప్రాంతమైన పెళ్లకూరుకు చెందిన రైతులు సుమారు 170 ఎకరాలకు పైగా చెరువు భూమిని కబ్జా చేసి సాగు చేస్తున్నారు. అంతే కాకుండా వర్షాకాల సమయంలో చెరువులోకి వరదనీరు పుష్కలంగా చేరుతున్న తరుణంలో ఎగువ ప్రాంతంలో కబ్జాకు గురైన చెరువు భూములు నీట మునుగుతున్నాయి. దీంతో ఎగువ ప్రాంత రైతులు చెరువు కట్టను దౌర్జన్యంగా తొలగించి నీటిని వృథా చేస్తున్నారు. అందువల్ల చివరి తడి సమయంలో సాగునీరు అందక ఇక్కడి రైతులు అనేక కష్టాలు పడుతున్నారు.

నెలబల్లి చెరువు సర్వే నంబరు 377లో 223.05 హెక్టార్లు విస్తీర్ణం కలిగి ఉంది. ఈ చెరువు నుండి నెలబల్లి, భీమవరం, అక్కగారిపేట, చింతపూడి తదితర దిగువ ప్రాంత గ్రామాల చెరువులకు సాగునీరు సరఫరా అవుతోంది. అయితే నెలబల్లి చెరువుకు ఎగువ భాగంలో తొట్టంబేడు మండలం పొయ్యి, సింగమాల, కొణతనేరి గ్రామాలకు చెందిన స్థానికేతరులు సుమారు 180 ఎకరాలకు పైగా ఆక్రమించుకోవడం విశేషం. ఈ విషయమై స్థానిక రైతులు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయితే టీడీపీకి చెందిన ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త వియ్యంకుడి కారణంగా ఆక్రమణలో ఉన్న చెరువు భూములపై ఏళ్ల తరబడి ఇక్కడి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారు.

పుల్లూరులో...

పుల్లూరు పెద్ద చెరువు సర్వే నంబరు 209–1లో 60 ఎకరాలు విస్తీర్ణం ఉంది. ఇక్కడ కూడా స్థానికేతరులు 30 ఎకరాలకు పైగా ఆక్రమించుకుని సాగు చేసుకోవడంతో స్థానిక రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై మూడేళ్లుగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. తాళ్వాయిపాడు తూర్పు, పడమర చెరువులు సర్వే నంబరు 79, 90లలో 8.26, 7.55 ఎకరాలు విస్తీర్ణం కలిగి ఉంది. అయితే ప్రస్తుతం చెరువులు రూపురేఖలు కూడా లేకుండా 90 శాతానికిపైగా ఆక్రమణల చెరలో ఉన్నాయి. నాయుడుపేట పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్నందున ఇక్కడి చెరువు భూములన్నీ కబ్జా కోరల్లోకి వెళ్లిపోయాయి.

భూస్వాముల దందా

చెంబేడు చెరువు సర్వే నంబరు 278లో 48.25ఎకరాలు, సర్వే నంబరు 278–1లో 832.90 ఎకరాలు మొత్తం 881.15ఎ కరాలు విస్తీర్ణం కలిగి ఉంది. అయితే ఎగువ ప్రాంతాలకు చెందిన భూస్వాములు సుమారు 345 ఎకరాలకు పైగా ఆక్రమించుకోవడం విశేషం. చెంబేడు చెరువు నుండి చెంబేడు, చెన్నప్పనాయుడుపేట, రాజుపాళెం గ్రామాల్లోని సాగు భూములకు సాగునీరు అందాల్సి ఉంది. ప్రస్తుతం చెరువు ఆక్రమణలతో సాగునీరు అందే పరిస్థితి కనబడడం లేదు.

పాలచ్చూరులో...

పాలచ్చూరు చెరువు సర్వే నంబరు 143–2లో 192.30ఎకరాలు విస్తీర్ణం ఉంది. స్థానిక పెత్తందారులు సగానికి పైగా ఆక్రమించుకోవడంతో వ్యవసాయ భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. ఇలా శిరసనంబేడు, పెన్నేపల్లి, కానూరు, చింతపూడి, రావులపాడు, కలవకూరు, అనకవోలు, పెళ్లకూరు గ్రామాల్లోని చెరువు భూములు సగానికి పైగా ఆక్రమణలకు గురి కావడంతో సాగునీరు సమృద్ధిగా నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లోని రైతులు సాగునీటికి ప్రతి యేటా తిప్పలు పడుతున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి చెరువు భూముల ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి ఏటా సాగునీటికి కష్టాలు



చిల్లకూరు పెద్దచెరువు, మన్నేమత్తేరి చెరువు ఎగువ భాగంలో చెరువు విస్తీర్ణాన్ని పెళ్లకూరుకు చెందిన కొందరు రైతులు కబ్జా చేశారు. చాలా కాలంగా చెరువు భూములను ఆక్రమించి సాగు చేసుకోవడంతో చెరువుల్లో సమృద్ధిగా సాగునీరు చేరడం లేదు. దాంతో ప్రతి ఏటా సాగునీటికి కష్టాలు తప్పడం లేదు. – శివ, రైతు చిల్లకూరు

జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి



మండలంలోని అన్నీ ప్రాంతాల్లో వ్యవసాయానికి జీవనాధారం చెరువులు. అయితే కొందరు పెత్తందారులు చెరువు భూములను ఆక్రమించుకొని సాగు చేసుకోవడంతో చెరువుల్లోకి సామర్థ్యం మేరకు సాగునీరు చేరడం లేదు. దీంతో సాగునీటికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. – వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ, చెంబేడు

పట్టించుకునేవారు లేరు



చెరువు భూముల ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. చెరువు నిండా నీరు చేరిన వెంటనే ఎగువ ప్రాంతంలో ఆక్రమణ భూములు మునక కారణంగా పెళ్లకూరు చెందిన కొందరు చెరువు కట్టను తొలగించేస్తున్నారు. దీంతో చెరువు నీరు వృథా పోతోంది. – సుబ్బరామయ్య, రైతు, చిల్లకూరు



చిల్లకూరు చెరువులో పెళ్లకూరు భూస్వాములు ఆక్రమించిన భూములు



భూ ఆక్రమణలతో గుంతలా మారిన చెరువు

నేడు బహిరంగ ప్రజావేదిక

పెళ్లకూరు: మండలంలోని పాలచ్చూరు గ్రామంలో ఆదిత్య బిర్లా కంపెనీ నిర్మాణం కోసం మంగళవారం బహిరంగ ప్రజా వేదిక నిర్వహించనున్నారు. కంపెనీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పంచాయతీ కార్యదర్శి వసంత్‌కుమార్ తెలిపారు. గ్రామస్తులంతా ప్రజావేదికలో తమ అభిప్రాయాలు వెల్లడించేందుకు హాజరు కావాలని కోరారు.

రైల్వే ఉద్యోగుల సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న రైల్వే ఉద్యోగులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం సూళ్లూరుపేట డివిజన్ ఎస్ఆర్ఎంయూ(సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్) నాయకుల ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు సంబరాలు చేసున్నారు. ఎస్ఆర్ఎంయూ వ్యవస్థాపకు డాక్టర్ కన్నయ్య సారథ్యంలో ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా యూపీఎస్ పెన్షన్ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడం అభినందనీయమని యూనియన్ డివిజన్ కార్యదర్శి జి.చెంచురత్నం అన్నారు. ఇదే విధంగా ఓపీఎస్ పెన్షన్ విధానంపై కూడా తమ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సూళ్లూరుపేట రైల్వే డివిజన్ ఏడీఎస్ అధికారి అలెగ్జాండర్‌తోపాటు రైల్వే ఉద్యోగులు, యూనియన్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోపాటు రైల్వే మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఆర్ఎంయూ నాయకులు మస్తాన్, చిరంజీవి, శివం, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 5.995 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 5.995 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1250 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నా రు. అలాగే సత్యసాయి గంగ కాలువకు 100, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



రాపూరులో రాధాకృష్ణుల కల్యాణం

సైదాపురం: మండలంలోని తురిమెర్ల, చాగణం రాజుపాళెం, సైదాపురం, ఊటుకూరు గ్రామాల్లో సోమవారం ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణుడి చిత్రపటానికి పూల మాలలు వేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఊటుకూరు గ్రామంలో ఉన్న శ్రీకృష్ణుడి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీవారు పేర్కొన్నారు. మండల కేంద్రమైన సైదాపురంలోని రామమందిరంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టి మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల శ్రీకృష్ణుడి వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. చాగణంరాజుపాళెంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కనులపండువగా రాధాకృష్ణుల కల్యాణం

రాపూరు: మద్దెలమడుగులో ఉన్న రాధా సమేత గోపాలకృష్ణ మందిరంలో సోమవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామిఅమ్మవార్ల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకుడు శశిధర్‌రెడ్డి తెలిపారు.ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, జేసీఎస్ నాయకులు దందోలు నారాయణరెడ్డి, భక్తులుపాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకలు వెంకటగిరిలో సోమవారం వైభవంగా జరిగాయి. పట్టణంలో ఉన్న పలు శ్రీకృష్ణ ఆలయాలకు మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. రాపూరు రోడ్డు క్రాస్ వద్ద ఉన్న శ్రీకృష్ణ మందిరంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుండి చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీకృష్ణునికి నిర్వహించిన పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.



ఊటుకూరులో రాధాకృష్ణుల ప్రత్యేక అలంకరణ

అలరించిన చిన్నారి కన్నయ్యలు

చిల్లకూరు: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం చిన్నారుల వేషధారణలు అందరినీ అలరించాయి. తీర ప్రాంతంలోని చింతవరం గ్రామంలోని రేస్ స్కూల్‌లో గోకులాష్టమిని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపికలు, కృష్ణ భగవానుడి వేషాల్లో ఉన్న చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బాలచెన్నయ్య మాట్లాడుతూ నేటితరం వారు సంస్కృతి, సాంప్రదాయాలను మరిచిపోతున్నారని తెలిపారు. దీనిని భావితరాలవారు గుర్తుంచుకునేలా ఇలాంటి పండుగలను ఆచరిస్తూ వాటి విశిష్టతను తెలియజేయాలని అన్నారు. శ్రీకృష్ణుడు కురుక్షేత్ర సమయంలో అర్జునుడికి బోధించిన గీతను నేటికీ భారతదేశంలోని ప్రతి కోర్టులో ప్రతిజ్ఞ చేయించేందుకు వినియోగిస్తున్నారన్నారు. అలాంటి శ్రీకృష్ణుని జన్మదినాన్ని ప్రతి ఒక్కరూ ఆనందంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని దిగువచావలి, తాళ్వాయిపాడు, జీలపాటూరు, దొడ్లవారిమిట్ట, చెంబడిపాళెం, చావాలి, చిల్లకూరు, పెళ్లకూరు, చెంబేడు, రోసనూరు, పాలచ్చూరు తదితర గ్రామాల్లో సోమవారం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని శ్రీకృష్ణుని ఆలయాలను విద్యుద్దీపాలు, మామిడి తోరణాలు, చలువ పందిళ్లతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో స్వామివారికి గణపతి పూజ, కలశ స్థాపన చేశారు. మహిళలంతా గోపూజ, సామూహిక కుంకుమార్చన, సహస్రనామ పూజలు చేపట్టారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: పలు చోట్ల కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాదెండ్లవారికండ్రిగ కృష్ణుని ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా మందిరంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు.

దక్కిలిలో..

దక్కిలి: మండలంలోని చాపలపల్లి గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కృష్ణ ప్రతిమను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. వెంకటరత్నమ్మ, పెంచలనరసయ్య, సుధాకర్, సుబ్రమణ్యం, ప్రసాద్, పెంచలరెడ్డి, నరసింహులు, సురేష్ పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణ, రూరల్ ప్రాంతాల్లో వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయి సత్సంగ నిలయంతోపాటుగా రాజావీధిలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్, రెడ్డి సంస్థ ద్వారా భక్తుల శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.



రాధాకృష్ణుల వేషధారణ, చిల్లకూరు: చింతవరంలో నృత్యాలు, చాపలపల్లిలో గ్రామోత్సవం, గూడూరు రూరల్: ప్రత్యేక పూజలు, అలరించిన వేషధారణలు

కలగుంటలో ప్రభుత్వ భూమి ఆక్రమణ

దొరవారిసత్రం: జాతీయ రహదారికి పక్కనే ఉన్న విలువైన ప్రభుత్వ భూముల ఆక్రమణలకు కేరాఫ్‌గా నెలబల్లి గ్రామ రెవెన్యూ మారింది. రెండేళ్ల కిందట ఈ భూములు ఆక్రమణకు గురికావడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. అయినా తాజాగా సోమవారం ఓ భూస్వామి పట్టాభూముల మాటున ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించేందుకు తెర తీశారు. వివరాలు... నెలబల్లి రెవెన్యూ కలగుంట ఎస్టీ కాలనీకి ఆనుకుని జాతీయ రహదారి సమీపంలో ఉన్న సర్వే నంబరు 127లో పట్టా భూమి ఉంది. ఈ పట్టాభూమికి చుట్టు పక్కలా ప్రభుత్వ భూమి, పశువుల మేత పొరంబోకు భూములు కూడా ఐదెకరాల వరకు ఉన్నాయి. దీనిపై కన్ను వేసిన ఓ భూస్వామి పట్టాభూములు తీర్చే క్రమంలోనే ప్రభుత్వ భూములను కూడా తీర్చేందుకు సిద్ధమయ్యాడు. గతంలో కూడా ఇదే ప్రభుత్వ భూములు తీర్చేందుకు పూనుకోవడంతో కాలనీవాసులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు అడ్డుకుని ప్రభుత్వ భూములను కాపాడారు. మళ్లీ ఇప్పుడు అదే క్రమంలో ప్రభుత్వ భూములు ఆక్రమించేందుకు పట్టపగలే యంత్రాలు పెట్టి ఆక్రమణకు దిగారని కాలనీ వాసులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎకరా భూమి రూ.45–50 లక్షలు వరకు ధర పలుకుతోంది. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సి ఉంది. లేకుంటే కలగుంట ఎస్టీ కాలనీకి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములు అంతా ఆక్రమణకు గురికాక తప్పదని కాలనీవాసులు వాపోతున్నారు.



కలగుంట ఎస్టీ కాలనీ పక్కనే ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న యంత్రం

స్పేస్ క్విజ్‌లో మణికి నగదు బహుమతి

శ్రీకాళహస్తి: నేషనల్ స్పేస్ డే క్విజ్‌లో తొట్టంబేడు మండలం పూడి గిరిజనకాలనీకి చెందిన కంపా మణి ప్రతిభ చూపాడు. నేషనల్ వాటర్ అకాడమీ, సెంట్రల్ వాటర్ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ నేషనల్ స్పేస్‌డే క్విజ్‌లో లోకో పైలెట్‌గా పనిచేస్తున్న మణి తృతీయస్థానం సాధించి, ధ్రువపత్రంతోపాటు రూ.50 వేలు నగదును పొందారు. ఆయన్ని పలువురు ప్రశంసించారు.



అధికారుల పర్యటనలపై అయోమయం



తీగపాళెం గ్రామస్తులను కదలకుండా ఒకే చోట అడ్డుకున్న భద్రతా సిబ్బంది

చిల్లకూరు: అధికారులు వస్తున్నారు.. భూములు చూస్తున్నారు. అడిగితే దగ్గరకు రానివ్వడం లేదు.. గ్రామంలో ఏం జరుగుతోందనే అయోమయంలో గ్రామస్తులు పడిపోయారు. దీనిపై సోమవారం తీగపాళెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ్మినపట్నం, లింగవరం పంచాయితీల్లోని భూములను కోస్టల్ కారిడార్ ఏర్పాటు కోసం సేకరించారు. అయితే ఆ భూములను సర్వే చేశారే తప్ప ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు. ఈలోగా తీగపాళెం వద్ద ఏపీఐఐసీసీ ద్వారా పరిశ్రమలకు భూములు అప్పగించే పనిని ఓ కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. వారు ఈ ప్రాంతంలోని 914 ఎకరాల భూమిలో మౌలిక వసతులు కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ పనిని ఆరంభించేందుకు వచ్చే నెలలో ప్రధానమంత్రి వచ్చే అవకాశాలుండడంతో జిల్లా స్థాయి అధికారులు పలుమార్లు సందర్శిస్తున్నారు. అయితే గ్రామస్తులకు తెలియకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. భూములకు పరిహారం చెల్లించరని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ వస్తున్నారని తెలిసి, అటుగా వెళ్లగా మౌలిక వసతులు కల్పించే కాంట్రాక్టు సంస్థకు చెందిన వారు తమను కట్టడి చేసి అధికారుల వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని నిరసన తెలిపారు.